# "నేను"

సి.భారతి

తాతమ్మ అలిగింది.

తాతమ్మ ఇలా అలగటంకొత్త కాదు. చాలా తరుచు జరిగే సంఘటనే.

తమ్ముడు ఫస్ట్‌క్లాస్‌లో ఇంటర్ పాసయ్యాడని ముందుగా వెళ్ళి తాతమ్మతో చెప్పలేదట. వాడు వాడి ఫ్రెండ్స్‌తో బాటు పేపరు పట్టుకుని అందరి నెంబర్లూ చూసుకుంటూ అటూ, ఇటూ తిరిగి సాయంత్రానికి, ఇల్లు చేరాడు.

ఇంటికి రాగానే వెళ్ళి తాతమ్మతో చెప్పాడు. కాని పొద్దున్నే పాసయినవార్త తెలియగానే చెప్పలేదని మూతి ముడిచింది.

"ఎనభై ఏళ్ళు దాటిన వాళ్ళు ఎవరికి కావాలి?" అంది. ఇంట్లో పెద్ద దాన్ని అందరి శుభమూ కోరేదాన్ని. అయినా ఎవరికీ లెక్కలేదు' అనుకుంది. ఇంట్లో ఇంతమంది ఉండి కూడా ప్రొద్దుటి నుంచి పాసైన వార్త తన చెవిని ఎవరూ వేయలేదని నిష్ఠురమాడింది.

నిజమే ఇంట్లో అందరం ఎవరి హడావిడిలో వారుండి తాతమ్మ మాట మర్చిపోయాం. ఇప్పుడేమిటి దారి? ఈ పూట తనకి ఆకలిలేదు-భోజనం వద్దు అంటోంది.

అమ్మే నెమ్మదిగా నచ్చ చెప్పి ఆవిడ అలక తీర్చాలి.

తాతమ్మ నాయనమ్మకు తల్లి. నాయనమ్మ తాతమ్మకి ఒక్కతే కూతురు అవటం చేత తన తమ్ముడికి, కూతురిని ఇచ్చి పెళ్ళి చేసి వాళ్ళ దగ్గరే ఉంటోంది. నాయనమ్మకు నాన్నగారు ఒక్కరే. నాన్నగారికి అన్నయ్య, నేను, తమ్ముడు. ఈ విధంగా అందరం ఒకే ఇంట్లో విడరాని బంధంగా ఉంటాము.

ఇంట్లో తాతమ్మ మాట అందరూ శ్రద్ధగా వింటారు. తాతగారికి ఆవిడంటే ప్రేమ. గౌరవం. ఏ పనయినా ఆవిడకు నచ్చినట్లుగానే చేసేవారు. ఆవిడకు నచ్చని పని అయితే నెమ్మదిగా దగ్గర కూర్చుని నచ్చ చెప్పేవారు.

నాయనమ్మ కూతురు కాబట్టి తాతమ్మను పెద్దగా పట్టించుకోక పోయినా ఆవిడకు బాధ ఉండేది కాదు. నాన్నగారిని ఒక్కడే మనవడు అవటం చేత ఆవిడ అతి గారాబంగా పెంచింది. నాన్నగారికీ ఆవిడంటే మమకారమే. అమ్మ సౌమ్యమూర్తి.

ఇంతవరకు ఆవిడ పెద్దరికం నిరాఘాటంగా సాగిపోయింది. అన్నయ్య పెళ్ళి జరిగిన తరువాత కొన్ని విషయాలు తాతమ్మకి నచ్చటం లేదు. వదిన ఎం.ఎస్సీ. చదివిందని అందరూ మురిపెంగానే ఉన్నారు ఇంట్లో. వదినకు ఉన్న ఊళ్ళోనే కాలేజీలో లెక్చరరుగా జాబ్ వచ్చినప్పుడు అమ్మ, నాయనమ్మ సంతోషంగా జాబ్ చేయమన్నారు. వాళ్ళిద్దరికీ తమ ఇంట్లో నుంచి ఒక ఆడపిల్ల బయటకు వెళ్ళి ఉద్యోగం చేయటం సంతోషంగా ఉంది.

నాయనమ్మ తరంలో చదువులు, ఉద్యోగాలు అంతగా లేవు. అమ్మ తరంలో చాలామంది స్త్రీలు చదివి, ఉద్యోగాలు చేసేవారు. వాళ్ళిద్దరూ చేయలేనివి బహుశా వదినలో చూస్తూ సంతోషించి ఉండవచ్చు. వాళ్ళిద్దరి ఉత్సాహం చూస్తే అన్నయ్య వదినను జాబ్ చేయవద్దన్నా వీళ్ళు ఊరుకునేటట్లు లేరు.

ఆ ఉత్సాహంలోనే నేను ఎమ్.ఏ.లో చేరతా నన్నాను. వదిన కూడా ప్రోత్సహించిరది. ఇంట్లో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.



వదిన ఉద్యోగం, నా చదువు తాతమ్మకి నచ్చలేదు.

"ఏమే వాణీ, పెళ్ళి చేసుకోవా? ఇంకా ఎన్నాళ్ళు చదువుతావే?" అంది నాతో.

"ఇరవై ఏళ్ళు వస్తున్నాయి. ఆడపిల్లకి ఇంకా పెళ్ళి చేయరేమర్రా?" అంది జనాంతికంగా.

తాతగారితో చెప్పి చూసింది- త్వరగా పెళ్ళి చేయమని.

"సంబంధం కుదిరే దాకా చదువు కుంటుందిలే" అన్నారు తాతగారు.

నాన్నగారికి నచ్చ చెప్పాలని చూసింది. 'పెళ్ళి కుదరగానే తక్షణం పెళ్ళి చేస్తా'నని చెప్పారు నాన్నగారు.

"నీ స్నేహితులు ఎవరైనా ఉంటే చూడు. చెల్లెలి పెళ్ళి బాధ్యత నీమీద మాత్రం లేదా?" అంది అన్నయ్యను.

అందరూ నా పెళ్ళికి వరుల కోసం చూస్తున్నామనీ, వరుడు దొరికిన తక్షణం నన్ను గృహిణిని చేస్తామని హామీ ఇచ్చారు.

తాతమ్మ కాస్త శాంత పడింది. కాని వదిన జాబ్‌కి వెళ్ళటం ఆవిడకు నచ్చలేదు. రోజూ ఏదో ఒక సాకుతో ఏమైనా అనేది. కాలేజీ నుంచి రావటం ఆలస్యమైతే "ఇంత ఆలస్యం ఏమిటి?" అనేది. "పెళ్ళయిన ఆడపిల్ల నట్టింట తిరుగుతూ ఉండాలి. కాని ఈ ఉద్యోగం ఏమిటి?" అనేది.

వదిన చేసిన ప్రతి పనికీ వంక పెట్టేది. ఇంట్లో అందరికీ తాతమ్మ ప్రవర్తన ఆశ్చర్యంగా, చికాకుగా ఉంది.

అమ్మకీ,నాయనమ్మకీ వదిన అంటే చాలా ఇష్టం. తమ లాగానే ఆ ఇంటికి వచ్చిన కోడలు. చిన్న పిల్ల, చదువుకున్నా నమ్రతగా ఉంటుంది. వదినను తాతమ్మ సాధించటం వాళ్ళిద్దరికీ నచ్చకపోయినా చేసేదేమీ లేక వీలైనంత వరకు వదిన ఆవిడకు కనపడే అవకాశం లేకుండా చేసేవారు. అయినా . ఒకింట్లో ఉన్నప్పుడు ఒకరి కొకరు ఎదురు పడక తప్పేదికాదు. తాతమ్మ ఏదో ఒకటి అనకుండా ఉండేది కాదు.

ఆరోజు వదిన 'ఊళ్ళో ఉన్న పుట్టింటికి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చింది. అప్పటికే అన్నయ్య ఆఫీను నుంచి వచ్చి స్నానం చేసి భోజనం చేస్తున్నాడు. వదిన ఇంటికి ఆలస్యంగా వస్తే ఏదో కారణం ఉండి ఉంటుందనుకుంటాముకాని ఆ విషయాన్ని గురించి ఇంట్లో ఎవరూ కూడా చర్చలు జరపరు. పట్టించుకోరు.

కాని తాతమ్మ గుమ్మంలో వదినకు స్వాగతం పలికింది. "ఇంత ఆలస్య మేమిటి? మీ ఆయనకు కనీసం పళ్ళెంలో ముద్ద వేసే తీరిక లేదా?" అంటుండగానే నాయనమ్మ వచ్చి "అమ్మా! నీకు మతి పోతోంది. అనవసర విషయాల్లో కలగ జేసుకుంటా వెందుకు?" అంటూ అక్కడి నుంచి తీసుకు వెళ్ళింది.

"బాధ పడుతున్నావా వదినా?" అంటూ నేను దగ్గరకు వెళ్ళాను.

"లేదులే వాణీ. కాని నాకు మనిషి స్వభావం చిత్రంగా కనిపిస్తోంది. సాయంత్రం మా అమ్మగారింటికి వెళ్ళాను కదా! అన్నయ్య నాతో మాట్లాడుతున్నాడు. ఇంతలో అన్నయ్య కొడుకు నందు అన్నయ్య దగ్గరకు వచ్చాడు. అన్నయ్య నాతో మాట్లాడుతూ వాడిని పట్టించుకోలేదు. అప్పుడు నందు కింద పడి ఏడవటం మొదలుపెట్టాడు. అయినప్పటికీ మాటల్లో పడి అన్నయ్య వాణ్ణి దగ్గరకు తియ్యలేదు. అప్పుడు వాడు ఉన్న చోటి నుంచి లేచి అన్నయ్యకు బాగా దగ్గర్లో ఎదురుగా వచ్చి మళ్ళీ కిందపడి ఏడవటంమొదలు పెట్టాడు- స్వరంపెంచి. వాడి ఏడుపుని భరించలేక అన్నయ్య అప్పుడు వాడిని దగ్గరకు తీసుకున్నాడు. ఇంతకీ నందూకి వయస్సు ఎంతో తెలుసా? పది నెలల పసివాడు. వాడినే గమనిస్తున్న నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అంత పసి వయస్సులో 'నేను' అనే స్మృతి కలిగిందంటే మనిషికి పుడుతూనే "నేను" అనేది వెంట వస్తుందన్న మాట. తన ఉనికి ఇతరులు గ్రహించాలి. తాతమ్మగారు తొంభైయ్యో పడిలో ఉన్నారు. ఏ పనీ చేయలేరు. తన పని చేసుకోవటమే అతి కష్టం. ఆవిడకు ఆవిడ కాలం నాటి అభిప్రాయాలు ఉండవచ్చు. కాని తన తరువాత నాలుగో తరంవాళ్ళ మీద కూడా తనమాట చెల్లాలనే ఉద్దేశం చిత్రంగా ఉంది కదూ! దీన్ని బట్టి మనిషికి శక్తి ఉన్నా లేకపోయినా, చేయగలిగినా చేయలేకపోయినా "నేను", 'నామాట' అనేది ప్రాణం ఉన్నంత వరకూ ఉంటుందను కుంటాను. అందుకే రమణ మహర్షి ముందుగా "నేను" గురించి తెలుసుకోమని అన్నారేమో!" అంది వదిన.

వదిన దూరదృష్టి, విశాల దృక్పథాలకు సంతోషించి "అవునేమో!" అన్నాను నేను సాలోచనగా. ●

